



హెలీకాప్టర్ నుంచి పరిశీలిస్తున్న పవన్

- పర్యాటక కేంద్రంగా పిన్నాపురం
- రాష్ట్రానికి అవసరమైన సగం విద్యుత్ ఇక్కడే ఉత్పత్తి
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్
- గ్రీన్‌కో కంపెనీ నిర్మించిన ఐఆర్‌ఈపీ ప్రాజెక్టు పరిశీలన


కారు డ్రైవ్ చేస్తూ



అద్భుత నగరంగా కర్నూలు



కర్నూలు/ఓర్వకల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'నగరాలు అభివృద్ధి చెందాలంటే ఎనర్జీ (పవర్) ఎంతో ముఖ్యం. రాష్ట్రానికి అసరమైన విద్యుత్‌లో సగం ఇక్కడే ఉత్పత్తి అవుతుంది. భవిష్యత్తులో అద్భుతమైన నగరంగా కర్నూలు అభివృద్ధి చెందుతుంది' అని డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుమ్మటంతండా, నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య గ్రీన్‌కో గ్రూప్ 2,800 ఎకరాల్లో 5, 5,230 మెగావాట్ల యూనిట్లు విద్యుత్ సామర్థ్యంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు (ఐఆర్‌ఈపీ)ను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. ఆయన వెంట గ్రీన్‌కో గ్రూప్ సీఈఓ, ఎండీ చలమలశెట్టి అనిల్, కర్నూలు కలెక్టరు పి. రంజిత్‌బాషా ఉన్నారు. ఐఆర్‌ఈపీలో భాగంగా నిర్మించిన అప్పర్ ఇన్‌టెక్ పాయింట్, లోయర్ ఇన్‌టెక్ పాయింట్ సహా పవర్ హౌస్‌ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విద్యుత్ ఉత్పత్తిపై కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా కారు నడుపుతూ టన్నెల్ పరిశీలించారు. అనంతరం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు పి. రంజిత్‌బాషా, రాజకుమారి, గ్రీన్‌కో గ్రూప్ సీఈవో, ఎండీ చలమలశెట్టి అనిల్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు దూరదృష్టికి పిన్నాపురం ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టే నిదర్శనమన్నారు. రాష్ట్ర విభజన తరువాత రాళ్ల సీమగా ఉన్న రాయలసీమను రత్నాలు సీమగా మార్చాలనే సంకల్పంతో ఆసియాలోనే తొలి వెయ్యి మెగావాట్లా సోలార్ ప్లాంట్ ఇక్కడే నిర్మించారు. సేద్యానికి పనికిరాని రాళ్ల భూమిలో ఒకే ప్రాంతంలో సోలార్, విండ్, హైడ్రో పవర్ జనరేషన్ చేసేలా ఐఆర్‌ఈపీ నిర్మాణానికి ఆనాడే శ్రీకారం చుట్టారు. ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో విదేశాలకు విద్యుత్ అమ్ముకునే స్థాయికి ఎదుగుతామన్నారు. ఈ ప్రాంతం భవిష్యత్‌లో సైట్ సీయింగ్ పర్యాటక క్షేత్రంగా, ఎడ్యుకేషనల్ ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటుందని వివరించారు. ఆఫీసుల్లో కూర్చొని రివ్యూలు చేస్తే ఇలాంటి అద్భుత విషయాలు తెలియవన్నారు. అందుకే క్షేత్రస్థాయిలో చూడాలన్న ఉద్దేశంతో ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు.

మిగతా 7వ పేజీలో


గ్రీన్‌కో ప్రతినిధులతో మంత్రులు పవన్ కళ్యాణ్, బీసీ, కలెక్టర్లు


ఐఆర్‌ఈపీలోని పంప్డ్ స్టోరేజ్‌ను పరిశీలిస్తూ...


మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, పవన్ కళ్యాణ్, కలెక్టర్లు రాజకుమారి, రంజిత్ బాషా


పవర్ హౌస్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిది

కలెక్టర్ పి.రంజిత్ బాషా


వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిదని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న నంద్యాల జిల్లాలోని సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన వడ్డే సుబ్బయ్య, సుబ్బమ్మ దంపతులకు 1807 జనవరి 11న జన్మించాడన్నారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి వడ్డే ఓబన్న వీరోచితంగా పోరాడారన్నారు. సమాజహితం కోసం వడ్డే ఓబన్న చేసిన సేవలు మరువలేనివని, వారి పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీగిరికి సంక్రాంతి శోభ



- మొదలైన బ్రహ్మోత్సవాలు
- ఈనెల 17న ముగింపు

శ్రీశైలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలం మహా క్షేత్రంలో శనివారం సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. పంచాహ్నిక దీక్షతో నిర్వహించే ఈ ఉత్సవాలు ఈ నెల 17 తేదీ శుక్రవారంతో ముగియనున్నాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు మొదటి రోజు ఉదయం 8.45 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యాయి. లోక కల్యాణం కోసం నిర్వహించే బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజూ జ్యోతిర్లింగస్వరూపుడైన మల్లికార్జునస్వామివారికి, మహాశక్తిస్వరూపిణి అయిన భ్రమరాంబికాదేవి అమ్మవారికి విశేషార్చనలు, ప్రత్యేక పూజలు, నవగ్రహ మండపారాధనలు, కలశార్చనలు, పారాయణాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు యాగశాల ప్రవేశం చేసి అనంతరం వేదపండితులు చతుర్వేద పారాయణాలతో వేదస్వస్తి నిర్వహించారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను చేసి, శివ సంచార దేవతలలో ఒకరైన చండీశ్వరునికి పూజలు జరిపారు. తరువాత రుత్విగ్వరణం నిర్వహించి, అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, వాస్తు హోమం చేశారు. సాయంకాలం అంకురార్పణ తర్వాత ఆలయ ప్రాంగణంలో నంది ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. అనంతరం భేరీపూజ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. శ్రీశైలం దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో సాయంత్రం హైదరాబాదుకు చెందిన అమృతాసింగ్ బృందం నృత్యప్రదర్శన అలరించింది.

నేడు స్వామి, అమ్మవార్లకు భృంగి వాహనసేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు విశేషపూజలు, భృంగివాహన సేవ నిర్వహించనున్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటో రియంలో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరిం చుకొని ప్రభుత్వ సెలవు దినం కారణంగా ప్ర జాఫిర్యాదుల పరిష్కార వేదికను తాత్కా లి కంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

15 వరకు మార్కెట్ యార్డుకు సెలవులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈనెల 15 వరకు సెలవులని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. రైతులు పంట ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని కోరారు. యథావిధిగా 16న పంట ఉత్పత్తులకు క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు.


కబడ్డీ ఆడుతున్న ఈగల్ అధిపతి

కప్పట్రాళ్లలో సంక్రాంతి సంబరాలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈగల్ అధిపతి రవికృష్ణ

దేవనకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్లలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ కుటుంబ సమేతంగా పాల్గొనడంతో గ్రామస్థులు తానా భవనం నుంచి కళ్యాణమండపం వరకు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కబడ్డీ, బ్యాడ్మింటన్, స్లోసైక్లింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతర సమావేశంలో ఈగల్ ఐజీ మాట్లాడుతూ పదేళ్ల క్రితం గ్రామంలో పరిస్థితులు దయనీయంగా ఉండేవన్నారు. నాడు తాను గ్రామాన్ని దత్తత తీసుకున్న తరువాత ఒక్కోఅడుగు ముందుకెస్తూ నేడు గ్రామంలో బ్యాంకు, కళ్యాణ మండపం, హైస్కూల్, తానా భవనం, సీసీ రోడ్లు, ఆర్వో ప్లాంటు వంటి అభివృద్ధి పనులు చేశామని, విద్యార్థులు చదువులో రాణిస్తున్నారన్నారు. 96 పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. పగలు వీడి గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటునందించాలన్నారు. యువకుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు మల్లికార్జున, చింపి ఈరన్న, ఎల్ఐసీ రాజు, చింత మధుసూదన్, సీఐ వంశీనాథ్ పాల్గొన్నారు.


కబడ్డీ విజేత జట్టుతో రవికృష్ణ

ఓర్వకల్లు సిగలో మరో పరిశ్రమ

- రూ.14 వేల కోట్లతో ఇండిచిప్ సెమికండక్టర్ పరిశ్రమ
- చిప్ తయారీ దేశంలోనే తొలి పరిశ్రమ ఇది
- రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ సమక్షంలో ఎంఓయూ

7

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా టి.చిరంజీవి

తుంగభద్ర తీరం సాహిత్యం




ఆరుసారా కథలు

ఆరుసారా కథలు తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప సంచలనం. ఈ సారా కథల్లో ఆనాటి ప్రభుత్వ యంత్రాంగాన్ని రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఎండగట్టారు. అయితే ప్రభుత్వం అసలు పని సొంత ఆస్తికి పోలీసు కాపలా కాయడమేనని 70 ఏళ్ల కిందటి మాట నేటికీ అక్షరసత్యం. రావిశాస్త్రి ఎప్పుడూ జనంలో, జనంతోనే ఉంటారు. వాళ్లతో నిత్యం సంభాషిస్తూనే ఉంటారు. ఆయన రచన వ్యాసంగానికి ఇది ఆయువుపట్టు. నీటిలో చేపలా ఎప్పుడూ సామాన్యులతోనే మెలిగేవారు ఆయన. బహుశా న్యాయవాదిగా కూడా ఆయనకు అనుభవం ఉండొచ్చు. రావిశాస్త్రి కథల్లో అతనే కనిపిస్తారని ఒక విమర్శ కూడా ఉంది. భ్రష్టుపట్టిన కొందరు పోలీసు వాళ్లు ఏమార్గంలోనైనా డబ్బు సంపాదించాలనే న్యాయవాదులు ఇంకా లిక్కర్ మాఫియా వాళ్లు.. వీళ్లందరి కుంభకోణంలో చితికిపడే బీదలు. ఆరుసార కథలోని పాత్రలు చాలా సంక్లిష్టమైన మానసికతను ప్రదర్శిస్తాయి. ఈ రచనలో ఉత్తరాంధ్ర మాండలికాన్ని అద్భుతంగా చూపారు. రావిశాస్త్రి ఈ కథలో పెద్దవాళ్లకంటే కష్టజీవులే తెలివైన వాళ్లు అని చెప్పినట్టుగా కూడా కనిపిస్తుంది. ఆరుసారా కథల్లో మొదటి కథ పాపిలో ఆ ఊరి డాన్‌ను కూడా సానుభూతితో చూపిస్తాడు. మంచోళ్లకే కాదు రౌడీలకు కూడా నీతి ఉండాలని చెప్పే విధంగా మలిచారు పాత్రను. రెండవ కథ మాయలో కొత్తగా పట్టభద్రుడైన న్యాయవాదికి ముద్దాయి ముత్యాలమ్మ కళ్ల బైర్లు కమ్మేవిధంగా జ్ఞానబోధ చేస్తుంది. పెద్ద ప్లీడర్లు, చిన్న ప్లీడర్లకు 'సత్యం, ధర్మం, న్యాయం మాటలు కాదు అదంతా కూడా మాయేనని..' చెప్పడం. 'పని కూలీ వాళ్లది లాభం యజమానులది' 'ఆకులు ప్రజలవి యాపిల్ పండ్లు అధికారులవి' వంటి మాటలు రక్తి కట్టిస్తాయి.

మరొక కథ న్యాయంలో వేశ్యల బతుకులను కళ్లకు కట్టేలా చూపించారు. 'అందరూ ఉంటే మీ కడుపున పుట్టిన ఆడకూతుర్లలాగానే నేనూ బతుకుదును, ఈ కుక్క బతుకు నాకెందుకు' లాంటి మాటలు మనిషిని ఆలోచనలో పడేస్తాయి. 'మోసం' కథలో కిందిస్థాయి పోలీసులు పడే బాధలను హెడ్ కానిస్టేబుల్ పాత్ర చేత చక్కగా చెప్పించారు. గవర్నమెంట్ అంటే ఓట్లు, ఓట్లు అంటే నోట్లు అనే సారాయి అమ్మే పాత్ర ద్వారా చక్కగా చెప్పించారు. మరొక కథ 'పుణ్యం'లో కోర్టులకు వచ్చి నలిగిపోయే బీద జనాల గురించి క్లైంట్ల కోసం కొట్టుకునే లాయర్ల వ్యక్తిత్వాన్ని చక్కగా చెప్పారు. ఈ కథలో 'మంచి, చెడు, పాపం, పుణ్యం లేవని లాభం, నష్టం రెండే ఉన్నాయని చెప్పారు. చివరి కథ 'మోక్షం'లో అభాగ్యులను నిరుపేదలను జైళ్లకు పంపే మెజిస్ట్రేట్ గారికి పిచ్చెక్కి ఆసుపత్రికి పోతూ 'గవర్నమెంట్‌కి పాపం పిచ్చెక్కినట్టుంది ఎలా ఉందో చూద్దాం పదండి' అని చివర్లో ముగించి ఆసక్తి కలిగించారు. ఈ కథల్లో పాఠకుడిని కాలర్ పట్టుకుని నిలిపేసే లక్షణం ఉంది. ఇవి చదివాక, చదవక ముందున్న స్థితిలో పాఠకుడు ఉండడు.

- ఎం.వెంకటేష్, ఆదోని

హేమంతపు చేమంతి



హేమంతం
కరుగుతుంటే
చేమంతి విరబూస్తుంది

హేమంతం
చేమంతికి ప్రియనేస్తం
యేటేటా
కలిసేవస్తారు

మురిపించే చేబంతి
మైమరపించే హేమంతి
వెరసి సంతోషాల
సంబరాల సంక్రాంతి

పచ్చికపై మంచు ముత్యాల్ని



హేమంతం తొడిగితే
రవి కిరణాలు
మెరుగులు దిద్దాయి

చల్లని గాలులు
నులివెచ్చని
సంక్రాంతి ఎండలు
వింతవింత అనుభూతులు

-సంగిపోగు ఆనంద్‌రాజు, ఆదోని

హరికిషన్‌కు చిన్న బుచ్చినాయుడు స్మారక పురస్కారం


ఎం. హరికిషన్


కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త, 80కి పైగా పుస్తకాలు ప్రచురించిన డాక్టర్ ఎం. హరికిషన్‌కు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 'చిన్న బుచ్చినాయుడు' స్మారక పురస్కారం శనివారం ప్రకటించింది. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కె. పుష్ప పురస్కార ప్రదానోత్సవ వివరాలు తెలిపారు. ఈనెల 18న ఉదయం 10 గంటలకు చిత్తూరు జిల్లా పలమనేరులోని కళామందిరంలో ఏర్పాటు చేసిన సాహితీ కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. సాహితీ రంగంలో డాక్టర్ ఎం. హరికిషన్ అందిస్తున్న విశేష సేవలను గుర్తించి పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు తన తండ్రి స్మారకార్థం నెలకొల్పిన 'చిన్న బుచ్చినాయుడు' స్మారక పురస్కారాన్ని తిరుపతి జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ప్రముఖ శతావధాని ఆముదాల మురళి చేతుల మీదుగా హరికిషన్‌కు అందజేయనున్నారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

నగరంలో నేడు



- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న కళాసౌరభవం జాతీయ స్థాయి నృత్యపోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి.
- నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో ఉదయం 11 గంటలకు ఆలయంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలపై నగర బ్రాహ్మణ సంఘం సమావేశం ఉంటుంది.
- నగర శివారులో మామిదాలపాడులోని గోదా గోకుల క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఉదయం 8 గంటలకు ప్రవచన బోధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
- నగర శివారు గుత్తిరోడ్డులోని ఇండస్ స్కూల్‌లో టీజీవీ ఫైన్ ఆర్ట్స్ సంస్థ వారి సౌత్ ఏషియన్ పీస్ కాన్ఫరెన్స్ సదస్సు ముగింపు వేడుకలను నిర్వహిస్తున్నారు.
- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు జాతీయ స్థాయి నృత్యపోటీల విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుంది.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ ఉమా శనివారం రాత్రి దర్శించుకున్నారు. ముఖ ద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

రంగుల మార్కెట్



సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు వాకిళ్లన్నీ ముగ్గులతో కళకళలాడుతుంటాయి. రంగురంగుల ముగ్గులు.. ఒక్కో రోజు ఒక్కో తీరుగా ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి మహిళలు ఉత్సాహంగా ముందుకొస్తారు. ఏ ఇంటికి వెళ్లినా ముందు కనిపించేవి రంగు రంగుల ముగ్గులు. సోషల్ మీడియా విస్తృతం కావడంతో ముగ్గులపై మహిళలకు క్రేజ్ మరింతగా పెరిగింది. ఫలితంగా మార్కెట్లలో ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగుపొడుల విక్రయాలు పెరిగాయి. వారం రోజులుగా ముగ్గులకు వినియోగించే రంగులకు మంచి డిమాండ్ ఏర్పడింది. నగరంలోని ప్రధాన కూడళ్లలో వ్యాపారులు రంగులను విక్రయిస్తున్నారు. ముగ్గుపిండితో పాటు రంగుల ధరలు ధర కిలో రూ.70-80 చొప్పున విక్రయిస్తున్నారు. ఓ మోస్తరు ముగ్గు వేసి రంగులు నింపాలంటే కనీసం రూ.150 దాకా వెచ్చించాల్సి వస్తోంది. అయినప్పటికీ మహిళలు ఖర్చులకు వెనుకాడకుండా పోటీపడి మరి కొనుగోలు చేస్తుండటం విశేషం.

-కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)


విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు


కొండారెడ్డి బురుజు వద్ద కొనుగోలు చేస్తున్న మహిళలు

కళాకారుల పుట్టినిల్లు కర్నూలు


శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కళలు, కళాకారులకు పుట్టినిల్లు కందనవోలు అని కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య అన్నారు. కర్నూలులోని నటరాజ నృత్య కళామందిర్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు రెండోరోజు శనివారం కార్యక్రమాలను పత్తి ఓబులయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ కళలకు ప్రాణం పోస్తూనే సంప్రదాయ జానపద నృత్యాలకు ఆదరణ కల్పిస్తూ నటరాజ నృత్య కళామందిర్ సంస్థ గత పదేళ్లుగా కృషి చేస్తోందని అన్నారు. వందలాది ఔత్సాహికులు ఇక్కడ నృత్య శిక్షణలు పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, ఆ దిశగా నాట్యాచార్యుడు కరీముల్లా కృషి అభినందనీయమని చెప్పారు. నాట్యాచార్యుడు కరీముల్లా మాట్లాడుతూ కళా సౌరభ పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీలకు స్థానిక కళాకారులతోపాటూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు ఇస్తున్న సహకారం మర్చిపోలేనిదని అన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నాట్యం...అలరించిన జానపద నృత్యాలు

జాతీయ స్థాయి నృత్య పోటీలలో సబ్ జూనియర్స్, జూనియర్స్ సీనియర్స్ విభాగాలతోపాటూ సోలో, గ్రూప్ విభాగాలలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 70 మందికి పైగా కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కూచిపూడి, భరతనాట్యంతో పాటు జానపద నృత్యాలతో ప్రేక్షకులను అలరింపజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నాట్యాచార్యులు ఎ. సంతోష్, జక్కా శ్రీకృష్ణ వ్యవహరించారు. నటరాజ నృత్య కళామందిర్ కార్యవర్గ కమిటీ ప్రతినిధులు డాక్టర్ బీవీ స్వరూప్ సిన్హా, కేపీఆర్ శర్మ సహకారం అందించారు.

ముగిసిన జాతీయ జూనియర్ రోల్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిడ్జ్ పాఠశాలలో జరుగుతున్న జాతీయ జూనియర్ రోల్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరై మాట్లాడారు. క్రీడాకారులు క్రీడలతోపాటు చదువులో రాణించాలన్నారు. పాఠశాల వ్యవస్థాప కుడు జి.పుల్లయ్య మాట్లాడు తూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమలో రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, సీఈవో గోపినాథ్, రవీంద్ర గ్లోబల్ పాఠశాల సీఈవో జి.వంశీధర్, రోల్‌బాల్ ప్రెసిడెంటు జి.చంద్రమౌళి, కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, కన్వీనర్ సునీల్ కుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నేషనల్ జూనియర్ రోల్‌బాల్ బాలుర ఫైనల్ విజేతలుగా రాజస్థాన్ (ప్రథమ స్థానం), తమిళనాడు (ద్వితీయ స్థానం), గుజరాత్ (తృతీయ స్థానం) సాధించారు. బాలికల విభాగంలో అస్సాం (ప్రథమ స్థానం), రాజస్థాన్ (ద్వితీయ స్థానం), మహారాష్ట్ర (తృతీయ స్థానం) సాధించారు. వీరికి టీజీ వెంక టేశ్, గౌరవ అతిథులు ట్రోఫీలను అందజేశారు.


క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న టీజీ వెంకటేశ్

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రీశైలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లి కార్జున స్వామి, అమ్మవార్లను శనివారం మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సెక్రటరీ చంద్రశేఖర్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మ వార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న చంద్ర శేఖర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రశేఖర్ స్వామి వారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారికి ప్రత్యే అర్చనలు జరిపించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో చంద్రశేఖర్‌కు వేదపండితులు వేదా శీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాస రావు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.


మంత్రిత్వశాఖ సెక్రటరీ చంద్రశేఖర్‌కు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో

అ'పూర్వ' కలయిక

25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1995-2000 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. తోటి స్నేహితులను చూసి ఒకరికొకరు ఆలింగనం చేసుకొని , తరగతి గదులలో చేసిన అల్లర్లను జ్ఞాపకం చేసుకొని సంతోషంతో ఉప్పొంగిపోయారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆటపాటలతో గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, రిటైర్డ్ హెచ్‌ఎం విజయ కుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు సిద్ధప్ప మోహన్ రావు, హనుమంతు, ఫిజికల్ డైరెక్టర్ నరసయ్య, సీనియర్ ఉపాధ్యాయుడు ఫయాజుద్దీన్, పూర్వవిద్యార్థులు ఆర్గనైజరులు బసవరాజు, ఈరన్న, గౌతమ్, భగవాన్ సింగ్, గౌరీ, రమణ, కన్యాకుమారి పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అహోబిలంలో గోదాదేవికి విశేష పూజలు



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 11(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ద్వాదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా కూడారై వెల్లుమ్మీర్ గోవింద పాశురం వేడుకలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామి, గోదాదేవి అమ్మవారికి వేకువజామునే విశేష పూజలు నిర్వహించారు. వెండి పాత్రల్లో అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ట్రాన్స్‌కో డైరెక్టర్ ప్రత్యేక పూజలు

ట్రాన్స్‌కో రాష్ట్ర డైరెక్టర్ ఏకేవీ భాస్కర్ కుటుంబ సభ్యులతో కలిసి దిగువ అహోబిలంలోని లక్ష్మీనృసింహ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని లక్ష్మీనృసింహ స్వామిని, అమృతవల్లి, గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాలను అందజేశారు.


భాస్కర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కనుల పండువగా 'శ్రీరాములోరి శోభాయాత్ర'

వేలాదిగా తరలివచ్చిన భక్తులు


లలితాపీఠం వద్ద శోభాయాత్రను ప్రారంభిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన 'శ్రీరాముల వారి శోభాయాత్ర' కనుల పండుగా నిర్వహించారు. సమితి నాయకులతో పాటూ, వివిధ ఆలయాల ధర్మకర్తలు, ధార్మిక సంస్థ ప్రతినిధులు, భక్తులు వేలాదిగా తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు. పాత నగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితాపీఠం నుంచీ ఈ శోభాయాత్ర ఆరంభమైంది. రాముల వారి భారీ విగ్రహాన్ని వాహనంపై అధిష్టింపజేసి, పుష్పహారాలు, కాషాయ పతాకాలతో అలంకరింపజేసి శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు లలితా పీఠంలో లక్ష రామనామ జపం పారాయణం చేశారు. లలితాపీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం. మోక్షేశ్వరుడు, అధ్యక్షుడు కె. క్రిష్టన్న, ఉపాధ్యక్షులు ఎస్‌జీ మహాబలేష్, చల్లా దామోదర్‌రెడ్డి, నాగోజీరావు, నాయకులు నటేష్, ఎస్వీ నారాయణరెడ్డి, అచ్చి నరసింగరావు, లక్ష్మయ్య, రామచంద్రశ్యామ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. యాత్రలో వివిధ ధార్మిక సంస్థలు, ఆలయాల కమిటీల నిర్వాహకులు, మహిళా భక్తులు సంప్రదాయంగా కాషాయ కండువాలతో ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు, పిల్లల కోలాట నృత్యాలు, భజనలు ఆకట్టుకున్నాయి. కాషాయ పతాకాలు ధరించిన యువత శోభాయాత్రలో సందడి చేశారు. పాతనగరంలోని వన్‌టౌన్, పూలబజార్, గడియారం ఆసుపత్రి, పెద్దమార్కెట్, కొండారెడ్డి బురుజు, రాజ్‌విహార్ మీదుగా రాజ్‌విహార్ బస్టాప్ పక్కన గల రేణుకా ఎల్లమ్మ ఆలయం జై శ్రీరామ్ అనే నినాదాలతో శోభాయాత్ర కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న స్వామీజీలు, మహిళా భక్తులు

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

- కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు
- 11 మందికి కన్సొలేషన్ బహుమతులు
- బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత






కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి



పవన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అద్భుత నగరంగా కర్నూలు

5వ పేజీ తరువాయి



పవన్‌కు స్వాగతం పలుకుతున్న కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా

ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఓర్వకల్లు విమానాశ్రయంలో ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్న పవన్‌కళ్యాణ్‌కు జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఎస్పీ బిందుమాధవ్, ఎయిర్‌పోర్టు డైరెక్టరు విద్యాసాగర్, డీఎస్పీ వెంకటరామయ్య తదితరులు ఘనస్వాగం కలికారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు నుంచి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. నంద్యాల ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, జడ్పీ సీఈవో నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల్లో నిరుత్సాహం

ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన ముఖ్య నాయకుల్లో ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పర్యటన నిరుత్సాహం నింపింది. షెడ్యూల్ ప్రకారం అర గంట పాటు జనసేన నాయకులతో పవన్‌కళ్యాణ్ సమీక్షించాల్సి ఉంది. పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చింతా సురేశ్, ఆదోని, ఎమ్మిగనూరు, మల్లప్ప, రేఖాగౌడ్, తెర్నేకల్లు యంకప్పతో పాటు కర్నూలు, శ్రీశైలం, డోన్, పత్తికొండ, నందికొట్కూరు, ఆత్మకూరు, కోడుమూరు నియోజకవర్గాల బాధ్యులు అర్షద్, అశోక్, బ్రహ్మ, రాజశేఖర్, మల్లయ్య, నల్లమల రవి, రాంబాబు, సురేశ్, ఏపీ వాల్మీకి/ బోయ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మంజూనాథ్‌లు గ్రీన్‌కో కంపెనీ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. జనసేన నాయకులతో బ్లాక్-8లో సమావేశం ఏర్పాటు చేశారు. వారితో అరగంట సమావేశమై పార్టీ బలోపేతం, నామినేటెడ్ పోస్టులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించాల్సి ఉంది. పర్యటన ఆలస్యం కావ డంతో సమావేశం నిర్వహించకుండానే పవన్ కళ్యాణ్ వెళ్లిపోయారు. దీంతో జనసేన నాయకులు కొంత నిరుత్సాహం చెందారు. తమవద్దకే వచ్చిన అధినేతను కలుసుకోలేకపోయామని ఓ నాయకుడు పేర్కొనడం కొసమెరుపు.

ఓర్వకల్లు సిగలో మరో పరిశ్రమ

- రూ.14 వేల కోట్లతో ఇండిచిప్ సెమికండక్టర్ పరిశ్రమ
- చిప్ తయారీ దేశంలోనే తొలి పరిశ్రమ ఇది
- రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ సమక్షంలో ఎంఓయూ



మంత్రులు లోకేశ్, టీజీ భరత్ సమక్షంలో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

కర్నూలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో మరో ప్రతిష్ఠాత్మక పరిశ్రమ చేరింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కష్టం ఫలించింది. భారతదేశంలోనే ప్రప్రథమ చిప్ తయారి సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు కీలకమైన అడుగులు శనివారం పడ్డాయి. చిప్ తయారీ రంగంలో దేశాన్ని గ్లోబల్ లీడరుగా మార్చే పరిశ్రమను ఇండిచిప్ సెమీకండక్టర్స్ లిమిటెడ్ సంస్థ తన భాగస్వామ్య సంస్థ అయిన జపాన్‌కు చెందిన ఎంఎస్‌యితో మైక్రో టెక్నాలజీ కంపెనీ (వైఎంటీఎల్)తో కలసి ఏపీలో స్థాపించనున్నారు. ఓర్వకల్లు కేంద్రంగా రూ.14 వేల కోట్లకు పైగా పెట్టుబడితో ప్రైవేట్ రంగంలో సెమికండక్టర్ పరిశ్రమ స్థాపించేందుకు రాష్ట్ర మానవవనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో ఇండిచిప్ మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్ బిచ్చేరియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మలు అవగాహన ఒప్పంద (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. ఈ మేరకు అమరావతిలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి.. ఆ పత్రాలను ఒకరిఒకరు మార్చుకున్నారు. ఇప్పటికే ఓర్వకల్లు పారిశ్రామికవాడలో సెమికండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు భాగస్వామ్య సంస్థలు పరిశీలించాయి. పరిశ్రమకు ఏర్పాటు అవసరమైన దాదాపు 250 ఎకరాలకు పైగా భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం కూడా ఆమోదించింది.

గత డిసెంబరులో ఓర్వకల్లుకు సెమికండక్టర్ పరిశ్రమ రాబోతుందని, రూ.14 వేల కోట్లకుపైగా పెట్టుబడితో ఈ పరిశ్రమ రాబోతుందని, దేశంలోనే మొట్టమొదటి పరిశ్రమను ఏపీకి తీసుకురావడం, అందులోనూ ఓర్వకల్లులో ఏర్పాటు చేసేలా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎంతో చొరవ తీసుకున్నారని మంత్రి టీజీ భరత్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జనవరి తొలివారంలో కంపెనీ, ప్రభుత్వ ప్రతినిధులు అవగాహన ఒప్పందం చేసుకొని సంబంధిత పత్రాలపై సంకాలు చేస్తారని కూడా వెల్లడించారు. 2024 నవంబరులో ప్రకటించిన సెమీకండక్టర్ పాలసీ ద్వారా చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ తయారీ హబ్‌గా మారుస్తుందని టీజీ భరత్ వివరించారు. సరికొత్త ఎస్‌ఐసీ ఫ్యాబ్ సైకర్యం ప్రారంభంలో నెలకు 10,000 వాఫర్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభం అవుతుంది. రెండుమూడేళ్లలో 50,000 వాఫర్స్ ఉత్పత్తి చేరుకుంటుంది. ఆత్మ నిర్భర్ భారత్ దృష్టితో అనుసంధానమై, విద్యుత్ వాహనాలు, నూతన ఇంధన పరికరాలు, పునరుత్పత్తి శక్తి ద్వారా పెరుగుతున్న గ్లోబల్ డిమాండ్ తీర్చేందుకు దోహదం పడుతుందని అంటున్నారు.

యువతకు ఉద్యోగాలే లక్ష్యం

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్ యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా రాష్ట్రానికి వివిధ పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ఎంతో కష్టపడుతున్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఆ కష్టంలో నేను పాలుపంచుకోవడం ఆనందంగా ఉంది. సెమీకండక్టర్ పరిశ్రమ ఓర్వకల్లు హబ్‌కు రావడంతో వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. యువతకు ఉద్యోగాలు కల్పించవచ్చు. దేశంలో వేరే రాష్ట్రానికి వెళ్లే ఈ పరిశ్రమను ఐటీ మంత్రి నారా లోకేశ్ మన రాష్ట్రానికి తీసుకొచ్చారు. లోకేశ్‌ను ఒప్పించి ఆ పరిశ్రమను మన జిల్లాకు తీసుకొచ్చాను. భారతదేశాన్నే చిప్ తయారీలో గ్లోబల్ లీడర్‌గా మార్చే ఈ పరిశ్రమ జిల్లాకు తీసుకురావడంతో జన్మభూమి రుణం కొంతైనా తీర్చుకున్నాను అనే ఆనందం కలిగింది.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా చిరంజీవి



కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా జిల్లాలోని మూడు కీలక స్థానాల్లో నూతన అధికారులు నియమితులు కానున్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జీవో నెంబరు 66 ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జాతీయ రహదారుల సంస్థ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గృహనిర్మాణ సంస్థ పీడీగా పనిచేస్తున్న టి.చిరంజీవిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన అభివృద్ధి (ఏపీఐఐసీ) సంస్థ జోనల్ మేనేజర్‌గా నియమించారు. ఆయన స్థానంలో ఆర్.వి.సునీతా భాయిని ఎన్‌హెచ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఇదే క్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కడప జిల్లా నుంచి కె.అనురాధను బదిలీ చేశారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా గత నెల ఒంగోలు నుంచి బదిలీపై వచ్చిన మధుసూదన్‌రెడ్డికి పోస్టింగ్‌పై ఇంకా స్పష్టత రాలేదు.

అంధుల ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ

- 31 మంది సభ్యుల రక్తదానం



సభ్యులను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు

కర్నూలు హాస్పిటల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అంధుల ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ అని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ మహేంద్ర కుమార్ అన్నారు. లూయి బ్రెయిలీ 216 జయంతి వేడుకలను పురస్కరించుకుని జాతీయ అంధుల సమాఖ్య (ఎన్ఎఫ్‌బీ) ఆధ్వర్యంలో నగరంలోని బీ.క్యాం పులో 31 మంది సభ్యులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అంధుల సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.పుష్పరాజ్, బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ లూయి బ్రెయిలీ కేవలం అంధులకే గాక ఇతరులకు కూడా స్ఫూర్తిదాతగా నిలిచారనీ కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎ ఫ్‌బీ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, మహేశ్వరరెడ్డి, జాతీయ మాజీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి వెంకట కృష్ణుడు, మాజీ చైర్మన్ గార్గేయాపురం శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర



శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో శ్రీరాముని శోభాయాత్రను శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో మేళతాళాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారి చిత్రపటాన్ని వాహనంపై ఉంచి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ఐ జిల్లా ఇన్‌చార్జిగా రాజేష్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కర్నూలు నూతన జిల్లా ఇన్‌చార్జిగా రాజేష్‌ను నియమించినట్లు బీఎస్ఎఫ్ఐ నేషనల్ కోఆర్డినేటర్ కరుణాకర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సమస్యలపై పోరాడతామన్నారు.

విజయవాడ ధర్నాలో డీటీఎఫ్ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ లో డీటీఎఫ్ నిర్వహించిన ధర్నాకు కర్నూలు డీటీఎఫ్ నాయ కులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117ను రద్దు చేయాలని కోరారు. 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని, నెలవారి పదోన్నతులు నిర్వహించాలని కోరారు. కార్యక్ర మంలో రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, రత్నం యేసేపు, జిల్లా మండల బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాసులు, రోశన్న, మద్దయ్య పాల్గొన్నారు.

థీమాటిక్ ఎగ్జిబిషన్ నేడు ముగింపు



లేపాక్షి ఎంపోరియంలో వస్తువులను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న లేపాక్షి ఎంపోరియంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 8 నుంచి ఏర్పాటు చేసిన థీమాటిక్ ఎగ్జిబిషన్ ఆదివారం రాత్రి ముగుస్తుందని లేపాక్షి ఎంపోరియం మేనేజర్ బి.తిమ్మయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తకళా ఉత్పత్తులపై 15 శాతం, చేనేత వస్త్రాలపై 10 శాతం తగ్గింపుతో అమ్మకాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ విశ్వం ఆదేశాల మేరకు ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు

గూడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా మునగాల గ్రామానికి చెందిన రామాంజనేయ లును ఆ పార్టీ అధిష్టానం నియమించింది. శనివారం గూడూరులోని అస్లాం కాంప్లెక్స్‌లో నగర పంచాయతీ చైర్మన్ జె వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన రామాంజనేయులును శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. రెండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: కర్నూలు రూరల్ మండల వైసీపీ అధ్యక్షుడిగా బి.తాండ్రపాడుకు చెందిన పేరపోగు మోహన్‌బాబును నియమితుల య్యారు. ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోడుమూరు నియోజకవర్గంలోని కర్నూలు రూరల్, కోడుమూరు, గూడూరు, బెళగల్ మండలాలకు కొత్తగా వైసీపీ అధ్యక్షులను నియమించింది. ఈసందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైసీపీ మండల అధ్యక్షుడి పదవీ కేటాయించిన అధినాయకత్వానికి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సమన్వయ కర్తలు ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటులో రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి, జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు అన్నారు. శనివారం ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు సం బంధించిన పోస్టర్లను స్థానిక సీఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు, ఫ్యాక్టరీ, ఆయిల్ గ్యాస్ కంపెనీలు ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్ కల్పించడం ద్వారా వెనుక బడిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ కేవలం సంతకాలకే పరిమితమైందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్‌నగర కార్యదర్శి బీసన్న, నగర నాయకులు కృష్ణ, చంటి, బాబయ్య, రాజశేఖర్, కళాకర్, అఖిల్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం



గ్రీన్ కో ప్రతినిధులతో పవన్ కళ్యాణ్

ఓర్వకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ శనివారం జిల్లా పర్యటనలో భాగంగా గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు విమానాశ్ర యానికి ఉదయం 12.52 గంటలకు చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో 1.05 గంటలకు ఓర్వకల్లు ఘనిలో ఉన్న సోలార్ విద్యుత్ ప్రాజెక్టు పంపు స్టోరేజీ ప్రాజె క్టును సందర్శించేందుకు బయలుదేరి వెళ్లారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఓర్వకల్లు విమానాశ్రయంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, గ్రీన్ కో ప్రాజెక్టు ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం పర్యటనను ముగించుకుని సాయం త్రం 4.40 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ లో చేరుకుని 4.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. ఆయనకు ఆయా శాఖల అధికారులు వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌ను చూసేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నాగరాజు, బీసీ సంఘం నాయకులు, మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, డీఎస్పీ మహబూబ్ బాషా హాజరై ప్రసంగించారు. అధ్యాపకులు విజయశేఖర్, ప్రసన్న కుమార్, మల్లికార్జున, జబీస్ అక్తర్, గిరిజారాణి, లక్ష్మి, ఉల్గోజి రావా నాన్ టీచింగ్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఓబన్న ఆశయాలను సాధిద్దాం: వడ్డే ఓబన్న బ్రిటీష్ దొరలను గడగడలాడించిన మహావీరుడు అని, ఆయన ఆశయాలను సాధిద్దామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక బీసీ భవన్‌లో వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దూరు రాంబాబు, ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పర శివన్న, ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రిష్ణోజీరావు, టీడీపీ బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు పీజీ వెంకటేశ్వర్లు, ఆరె కటిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివాజీ, నగేష్ పాల్గొన్నారు.

ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలి: తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్: బ్రిటీష్ వారిపై పోరుసలిపిన వడ్డే ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి యువతకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వడ్డెర సంఘం నాయకులు జే.తిరుపాల్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబన్న జయంతి కార్యక్రమానికి కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వడ్డె ర సంఘం నాయకులు మంజునాథ్, డీవీ చంద్ర, సర్వేసరరావు, మాణిక్యం పాల్గొన్నారు.

● స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న చేసిన సేవలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని ఎంపీ నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని ఎంపీ కార్యాలయం లో వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఓబన్న చేసిన పోరాట పటిమను భవిష్యత్తు తరాల వారికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.

ముగ్గులు వేయడం కళ



ముగ్గుల పోటీల విజేతలతో రాయల మహిళా సంఘం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు ముగ్గులు వేయడం ఓ కళ అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, మహీంద్ర ఆటో మోటివ్స్ మేనేజింగ్ డైరెక్టర్ యర్రంశెటి రాజేశ్వరి, బిల్డర్ ఉలిందకొండ వెంకటరమణ అన్నారు. శనివారం నగరంలోని ఏ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్‌లో నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో, రాయల మహిళా సంఘం మహిళా ప్రతినిధుల నేతృత్వంలో 'రాయల మహిళలు - రంగవల్లులు' పేరుతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా పత్తి ఓబులయ్య, యర్రంశెట్టి రాజేశ్వరి, ఉల్లింద కొండ వెంకటరమణ మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి లక్ష్మీదేవి (ఆళ్లగడ్డ), ద్వితీయ బహుమతి ఉమా పార్వతి, తృతీయ బహుమతి లీలావతి (కర్నూలు) గెలుచు కున్నారు. ప్రశంసాత్మక బహుమతులు గాయత్రి, దివ్య, లక్ష్మి కైవశం చేసుకున్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కేవీఆర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ విష్ణువందన వ్యవహరించారు. కార్యక్రమంలో కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లం రవికుమార్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌కుమార్, గౌరవ సలహాదారు సోమ శేఖర్, శోభన్‌బాబు, కోశాధికారి శైలేష్, గాండ్ల శివనాగరాజు, రాయల మహిళా సంఘం ప్రతినిధులు ఆలా నాగేశ్వరమ్మ, సుధావర్షిణి, విజయలక్ష్మి, నవిత, ఆదిలక్ష్మి, బ్రాహ్మణి, హేమలత, నాగేశ్వరమ్మ, దేవి, కనకదుర్గ పాల్గొన్నారు.

మద్రాసు హైకోర్టు తీర్పును ఆహ్వానిస్తున్నాం



మాట్లాడుతున్న జెట్టి ప్రభుదాస్

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అమెరికన్ బాప్టిస్టు మిషన్ ఆస్తులపై మద్రాసు హైకోర్టు ఇటీవల వెలువ రించిన తీర్పును ఆహ్వానిస్తున్నామని క్రైస్తవ ఐక్యవేదిక తెలుగు బాప్టిస్టు ఫీల్డ్ అధ్యక్షుడు జెట్టి ప్రభుదాసు అన్నారు. శనివారం నగరంలోని భాస్కర్‌నగర్‌లోగల క్రైస్తవ ఐక్య వేదిక ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత ముప్పయ్ ఏళ్లుగా సీఎస్ నెం. 124/94 కేసులు అనేక వాదోపవాదాలు విన్న పిదప మద్రాసు హైకోర్టు కర్నూలులో ప్రాప ర్టీ కమిటీ ఆఫ్ అమెరికన్ బాప్టిస్టు చర్చి (పీఏ బీసీ)వారు అక్రమంగా ఆస్తుల అన్యాక్రాంతం చేశారని, కాబట్టి ట్రస్టీగా పీఏబీసీని పూర్తిగా తొలగిస్తూ, ఎస్టీబీసీని అడ్మినిస్ట్రేషన్ నుంచి తప్పిస్తూ సంచలన తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఏపీ క్రైస్తవ వేదిక నాయకులు జాషువా డానియల్, ప్రాపర్టీ కమిటీ చైర్మన్ ప్రభాకర్, సాంసంగ్ జాన్ వెర్షన్ పాల్, రాజేష్ రవి, ఆర్‌పీ సజీవన్, ఇమ్మానియేల్ కుమార్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను ప్రోత్సహించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు హాస్పిటల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పోత్సహించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని బంగారుపేటలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి పాల్గొన్నారు.

బైకు దొంగ అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న సయ్యద్ షరీఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దేవనకొండ మండలం గుండ్లకొండ కొట్టాలకు చెందిన సయ్యద్ షరీఫ్ చెడు వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం నగరం లో పలు చోట్ల పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేశాడు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజరావు తెలిపారు. నిందితుడిపై గతంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు సార్లు బైక్ చోరీ కేసులు ఉన్నాయి. కర్నూలులో బైకులు చోరీ చేసి మహబూబ్ నగర్ జిల్లాలో పలు గ్రామాల్లో బైకులు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి, కానిస్టేబుళ్లు మహేంద్ర, శ్రీనివాసులు, పర్షద్ ఖాన్, లక్ష్మణ్ నాయక్ లను సీఐ అభినందించారు.

లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్ సందర్శన

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫర్‌మెన్ డిగ్రీ కాలేజీలో కొనసాగుతున్న లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్‌ను శనివారం ఇండియన్ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేష్, లక్ష్య సెంటర్స్ ఇన్‌చార్జి, పారా ఒలింపిక్స్ మెడలిస్టు దీప్తి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను జాతీయ అం తర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కోచ్ బ్రహ్మకుమార్, హారిక పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ఎర్రజెండా ఉంటుందని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని కారల్ మార్క్స్ నగర్‌లో సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు డి.నల్లన్న అధ్యక్షతన జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతి థిగా సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ హాజరై జెండావిష్కరించారు.

అభివృద్ధి పనులతో సంక్రాంతి శోభ: ఎమ్మెల్యే



కె. నాగలాపురంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, హుసేనాపురంలో..

గూడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులతో పల్లెలకు సంక్రాంతి శోభ వచ్చిందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం మండలంలోని కె నాగలాపురం గ్రామంలో పల్లె పండుగ భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పల్లెల్లో రోడ్ల నిర్మా ణం చేపట్టి గుంతలు లేని రహదారులు, సీసీ రోడ్లు, గోకులం షెడ్ నిర్మాణాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె నయోమి, తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివ నాగప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

గోకులం షెడ్లను వినియోగించుకోండి: పీడీ

ఓర్వకల్లు: గోకులం షెడ్లను విని యోగించుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకట రమణయ్య రైతులకు సూచించారు. శనివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో రైతు మహేంద్ర నిర్మించుకున్న గోకులం షెడ్డును డ్వామా పీడీతోపాటు పశుసంవర్థక శాఖ జేడి జి.శ్రీనివాస్, సర్పంచు చంద్ర గోవర్ధనమ్మలు ప్రారంభించారు. పీడీ వెంకట రమణయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకం ద్వారా 90 శాతం రాయితీతో రైతులు గోకులం షెడ్లు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏడీఏ పార్థసారథి, ఏపీడీ లక్ష్మన్న, సీఎల్ఆర్సీ కోర్స్ డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్ సాయినాథ్, పశు వైద్యాధికారులు మనోజ్, మదన్, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఈసీ పెంచలయ్య, టీఏ, ఎఫ్ఏలు మధుశేఖర్, శ్రీనివాసులు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్లు చంద్ర పెద్ద స్వామి, జీకె.సుధాకర్, గ్రామ నాయకులు ప్రశాంత్, నాగరాజు, రామ గోవిందు, రాముడు, కాటినేని నారాయణ, గౌస్, రైతులు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతపై కమిషనర్ ఆరా

కర్నూలు న్యూసిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కొండారెడ్డి బురుజు సమీపంలోని అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, క్యాంటీన్ పరి సరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

కర్నూలు న్యూసిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవా రం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు నగర పాలక కమిషనర్ రవీంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రభుత్వ సెలవు కారణంగా కార్యక్రమం రద్దు చేశామని తెలిపారు.

కాంగ్రెస్ ఓబీసీ జిల్లా చైర్మన్‌గా డీవీ సాంబశివుడు

కర్నూలు అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ ఓబీసీ విభాగం చైర్మన్‌గా డీవీ సాంబశివుడిని నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు.

పింఛన్ల పరిశీలన

సి.బెళగల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబందహాల్, పలుకు దొడ్డి, కొండాపురం, గుండ్రేవుల, ముడుమాల, కొత్తకోట గ్రామాల్లోని దివ్యాంగుల పింఛన్లను ఎంపీడీవో రాణెమ్మ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు గత ప్రభుత్వంలో కొంతమంది అవిటితనం లేకున్న కూడా దివ్యాంగులుగా సర్టిఫికెట్లు తెచ్చుకొని పింఛన్లు తీసుకుంటురన్నారు. అటువంటి వారిని అనర్హులుగా గురించి పింఛన్లను తొలగిస్తామన్నారు.

అనుమతి లేకుండా ఎర్రమొరుసు తరలిస్తే చర్యలు: అనుమతి లేకుండా ఎర్ర మొరుసు తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు. శనివారం పోలకల్లు, కొండాపురం, సిబెళగల్, బ్రాహ్మణదొడ్డి, క్రిష్ణదొడ్డి, సంగాల, చింతమానుపల్లె గ్రామాల్లో అనుమతి లేకుండా ఎర్ర మొరుసును తరలిస్తున్నట్లు రైతులు ఎస్ఐ తిమ్మారెడ్డికి విన్నవించుకున్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు: ఎస్పీ

కర్నూలు క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో కోడి పందాలు, పేకాట, జూదం నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జి.బిందుమాధవ్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను కుటుం బ సభ్యులతో ఆనందోత్సహాలతో జరుపుకోవాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. డయల్ 100కి, 112కు గానీ, పోలీస్ కంట్రోల్ రూమ్, వాట్సాప్ నెంబర్. 7777877722 కు సమాచారాన్ని అందించాలన్నారు.

గడ్డివాము దగ్ధం

కల్లూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.మార్కాపురంలో ఐటీడీపీకి చెందిన బోయ వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈలోపు దాదాపు రూ.40వేలు విలువ చేసే పశుగ్రాసం దగ్ధమైనట్లు బాధితుడు బోయ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు పరిశీలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వెంకాయపల్లెలోని రవీంద్ర మహిళా, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. కార్యక్రమానికి 2009-2012 పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ హాజరై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేతః శ్రీనివాసమూర్తి, డా.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

మైఫర్‌లో ఫ్రెషర్స్ డే

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏ.క్యాంపు లోని మైఫర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ సురేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ శివకుమార్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆదిమూలపు సతీష్, డా.స్టెల్లా సతీష్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, రాజ్‌కుమార్, రఘువీర్ పాల్గొన్నారు.

కుడారై సేవ



గోదా గోకులంలో ధనుర్మాస వేడుకలు

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మామిదాలపాడులోని గోదారంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో ధనుర్మాస వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా కీలకమైన 'కుడారై సేవ' శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4:30 గంటలకు నిత్య ఆరాధన, శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి భోగ మూర్తులకు, గోదా శ్రీకృష్ణులు, సాలగ్రామాలకు మహా మండపంలో పంచసూక్త పారాయణంతో అర్చక స్వాములు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులతో విష్ణు సహస్రనామ పారాయణ, గోవింద నామాలు పఠించారు. నగర సంకీర్తన అనంతరం కుడారై సేవలో భాగంగా స్వామివారి తిరునామం, శంఖు, చక్ర రూపాల్లో 108 గంగాళాల్లో విశేష పాయస నివేదన చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు మాట్లాడుతూ ఆలయంలో సోమవారం సాయంత్రం 6:30 గంటలకు భోగిపండుగ, గోదా రంగనాథుల లఘు కల్యాణం, మంగళవారం మకర సంక్రాంతి పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 15 నుంచి 17 వరకు అధ్యయనోత్సవాలు, 19న ఉదయం 10 గంటలకు గోదా రంగనాథుల వైభవ కల్యాణం, శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథుల కల్యాణసేవ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



వేడుకను తిలకిస్తున్న భక్తులు

సచివాలయం.. బహు దూరం

- మద్దికెర మండలంలోని హంప, కొత్తపల్లి, బొమ్మనపల్లి, ఎడవల్లి గ్రామాలకు ఒకే సచివాలయం
- అవస్థలు పడుతున్న గ్రామస్థులు



పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన సచివాలయం

మద్దికెర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హంపా, కొత్తపల్లి, బొమ్మనపల్లి, ఎడవల్లి గ్రామాలకు ఒకే సచివాలయం ఉంది. కాగా కొత్తపల్లి బొమ్మనపల్లి గ్రామానికి మజరా గ్రామం. నాలుగు గ్రామాలకు ఒకే సచివాలయం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పథకాలు అందాలన్నా... జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఏదీ కావాలన్నా సచివాలయాల ద్వారానే తీసుకోవాల్సి ఉంది.

కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

ప్రజలకు ఇంటి వద్దే, సమీపంలోనే ప్రభుత్వ సేవలు అందించే ఉద్దేశ్యంతోనే గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టింది. అయితే మద్దికెర మండలంలోని ఈ నాలుగు గ్రామాలకు సచివాలయ సేవలు అంత సుళువుగా అందడం లేదు.

వృద్ధులు, మహిళల అవస్థలు

హంపా గ్రామంలో సచివాలయం ఉంటంతో కొత్తపల్లి, బొమ్మనపల్లి, ఎడవల్లి గ్రామాల ప్రజలు దాదాపు 7-8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఆటోలు అందుబాటులో లేకపోవడతో ద్విచక్రవాహనాల్లో వెళ్లాలి. అవి లేకుంటే ఇక నడవాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎడవలి, కొత్తపల్లి, బొమ్మనపల్లి గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయానికి వెళ్లాలంటే ఇబ్బంది



హంపా గ్రామంలోని సచివాలయానికి వెళ్లేందుకు రోడ్డు, బస్సు సౌకర్యాలు లేవు. ఆటోల్లో వెళ్లాలంటే అధికంగా డబ్బు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం బొమ్మనపల్లి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేయాలి.

- రంగస్వామి, కొత్తపల్లి



నూతన భవనం ప్రారంభమెప్పుడు?

హంప గ్రామంలో సచివాలయాన్ని పంచాయతీ భవనంలోని ఇరుకు గదిలో ఏర్పాటు చేశారు. గ్రామ శివార్లలో రెండేళ్ల క్రితమే సచివాలయం కోసం నూతన భవనాన్ని నిర్మించారు. అయితే దీన్ని ఎవరూ ప్రారంభించడం లేదు. రాజకీయ కారణాలతోనే ప్రారంభించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పనులు పూర్తికాగానే ప్రారంభిస్తాం



మండలంలోని హంప గ్రామంలో నూతన సచివాలయ భవనం నిర్మించాం. అయితే భవనంలో విద్యుత్, బాత్‌రూమ్ పనులు పెండింగ్ ఉన్నాయి. వాటిని కూడా పూర్తిచేసి త్వరలో సచివాలయాన్ని ప్రారంభిస్తాం.

- కొండయ్య, ఎంపీడీవో, మద్దికెర

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

తుగ్గలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ మండల అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.వేల కోట్లు భారం మోపారన్నారు. ఎన్నికల ముందు చార్జీలు తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే పెంచడం అన్యాయమన్నారు. ఈశ్వరప్ప, నాగన్న, తదితరులు ఉన్నారు.

రేపు సంక్రాంతి ముగ్గుల పోటీలు



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకుడు పెద్దయ్య

పత్తికొండ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న పట్టణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పెద్దయ్య తెలిపారు. శనివారం మాట్లాడుతూ సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉదయం 10 పోటీలు ఉంటాయన్నారు. ఉపేంద్ర, రవి, శివ, నజీర్, వసంత, శంకరమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించం


జియో మైసూరు ప్రతినిధితో మాట్లాడుతున్న నాయకులు

తుగ్గలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జియో కంపెనీకి భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం చేస్తే సహించమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం పీఆర్వో సోమిరెడ్డి రామ్మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బంగారు నిక్షేపాల వెలికితీతకు కేవలం 350 ఎకరాలు కొనుగోలు చేశారనీ, మిగిలిన భూములను కూడా కొనుగోలు చేయాలని కోరారు. స్పందించిన పీఆర్వో ఇప్పటికే రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చామని, సమస్యలు ఉంటే యజమాన్యం దృష్టికి తీసుకెళ్తామమని హామీ ఇచ్చారు. బీఎస్ ఈరన్న, తిమ్మారెడ్డి, హరినాయుడు, నూర్‌బాషా, వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి


ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెలుగుండు ఆంజనేయ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కర్నూలు ఎంపీ నాగరాజును టీడీపీ యువ నాయకుడు నేత బెల్లం రఘ బాబు శనివారం విన్నవించారు. కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలన్నారు. టీడీపీ నాయకుడు రంగయ్య మాట్లాడుతూ ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనం నిర్మించినా రెండేళ్లుగా ప్రారంభించలేదని, జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా మిగిలిపోయిందని నగరడోణ, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రఘునాథ్ రెడ్డి, గౌడ్, రంగయ్య, సూర్యనారాయణ, రఘుబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వెల్దుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కీ.శే. బొమ్మన శివశంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం వెల్దుర్తిలో సూపర్-8 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. కుమారుడు రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జడ్పీహెచ్ఎస్ మైదానంలో టీడీపీ మండలాధ్యక్షుడు బలరాంగౌడ్, ఎస్ఐ అశోక్, సుధాకర్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. రామచంద్రనాయుడు, బజారు పాల్గొన్నారు.

శనగ రైతులను ఆదుకోవాలి


మొలగవల్లిలో శనగ పంటను చూపుతున్న రైతులు

ఆలూరు రూరల్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): శనగ రైతులను ఆదుకోవాలని వ్యవసాయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేశ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామనాథ్ యాదవ్, టీడీపీ కన్వీనర్ అశోక్ యాదవ్ శనివారం కోరారు. వర్షాలతో నష్టపోయిన శనగ పంటను పరిశీలించారు. వాతావరణ పరిస్థితులతో శనగ దిగుబడి రాలేదని, బీమా వర్తింపజేసి, అన్నదాతకు పరిహారాన్ని చెల్లించాలని కోరారు. రైతులు ఆంజనేయ్య, మాణిక్య రెడ్డి, ఐకాంత్, శ్రీరామ జైరామ్ పాల్గొన్నారు.

కంబాలపాడు సర్పంచ్ మారెమ్మ మృతి



క్రిష్ణగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కంబాలపాడు సర్పంచ్ మారెమ్మ(52) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. సర్పంచ్ మృతదేహానికి మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న నివాళి అర్పించారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తెలుగు యువత నాయకుడు కేఈ నందీష్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.

గోకులం షెడ్లతో రైతుల అభివృద్ధి

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న నాయకులు

తుగ్గలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లతో రైతులు అభివృద్ధి చెందుతారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం జి.ఎర్రగుడి, చిగుర్లగుట్ట తండా, గిరిగిట్ల, అమీనాబాదు, చెన్నంపల్లి గ్రామాల్లో గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీని ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు ఇచ్చారన్నారు. ఒక్కో గోకులం షెడ్డును రూ.2.30 లక్షలతో నిర్మించామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బత్తిన వెంకట్రాముడు, తిమ్మయ్య చౌదరి, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్, తిరుపాల్ నాయుడు, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్, మధుబాబు, జడ్పీటీసీ సభ్యులు పులికొండ నాయక్, ఏపీవో హేమసుందర్ పాల్గొన్నారు.

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి

వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలని తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, తిమ్మయ్య చౌదరి, మనోహర్ చౌదరి హితవు పలికారు. శనివారం మండలంలోని గిరిగిట్ల గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఘటన ఉహించనదని పాలక మండలి బురద జల్లడమేమని ప్రశ్నించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న నాయకులు

ఆలూరు రూరల్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం మొలగ వల్లి గ్రామంలో గోకులం షేడ్‌ను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు సాగు నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలతో అభి వృద్ధిలో ముందుకు పోతుందని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీలకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్ రాజ్, కన్వీనర్ అశోక్ యాదవ్, ఏపీవో శ్రీనివాసులు, మోక మల్లయ్య, ఆంజనేయ్య, వెంకటేశ్వర్లు, వన్నూర వలి, కొమ్ము రాజు, రాము యాదవ్, గోపల్, రామాంజినేయులు, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర పూజలు చేస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఆదోని, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారామనగర్‌లో క్షుద్ర పూజలు చేస్తున్నవారిని అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ రామలింగయ్య తెలిపారు. వివరాల మేరకు.. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో హైదరాబాదుకు చెందిన బాలరాజు అనే వ్యక్తిని సంప్రదించాడు. క్షుద్రపూజలు చేస్తే చక్కబడతాయని బాలరాజు నమ్మబలకడంతో ఈనెల 10న క్షుద్ర పూజలు చేశారు. సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇరువురిని అరెస్ట్ చేశారు. హెడ్ కానిస్టేబుల్ రామలింగయ్య ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హిందువుల ద్రోహిగా మాట్లాడుతున్నారు


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

ఆదోని టౌన్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావంపై అనుచిత వ్యాఖ్యలు చేసి, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి హిందువుల ద్రోహిగా మాట్లాడారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీల కంఠ ధ్వజమెత్తారు. శనివారం మాట్లాడుతూ హైందవ శంఖారావాన్ని తానే నడిపించానని, సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడడంతో సభ గురించి ఆయనకు అవగాహన లేదన్నారు. కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఆదోని నార్త్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్, దేశాయ్ చంద్ర పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి

తుగ్గలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాలు, గ్రామ శివార్లలోని సారా బట్టీలపై పత్తికొండ ఎక్సైజ్ సీఐ ఈశ్వర్‌రావు సిబ్బందితో దాడులు చేసి బెల్లం ఊట, నాటుసారాను ధ్వంసం చేశారు. శనివారం బాట తండా, రోళ్లపాడు తండా శివారులోని బట్టీలపై దాడులు చేసి 1,425 లీటర్ల బెల్లం ఊటతో పాటు నాటుసారా బిందెలను ధ్వంసం చేశారు. సారా తయారీదారులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు



ముళ్ల కంప తొలగించిన ఆసుపత్రి

మద్దికెర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని కవిరెడ్డి వీధి ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిసరాల్లోని ముళ్లకంప, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'అనారోగ్య కేంద్రం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీసీ కాంక్రీట్ నిర్మిస్తామని ఎంపీపీ అనిత తెలిపారు.

వైసీపీ కన్వీనర్లు..

ఆలూరు రూరల్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా కురవళ్ళి గ్రామానికి చెందిన కురవ మల్లికార్జున ఎన్నికయ్యారు. అధినేత వైఎస్ జగన్, ఎమ్మెల్యే విరుపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వెల్దుర్తి కన్వీనర్‌గా బొమ్మన రవిరెడ్డి

వెల్దుర్తి టౌన్: వెల్దుర్తి వైసీపీ కన్వీనర్‌గా బొమ్మన రవిరెడ్డిని శనివారం వైసీపీ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. పట్టణ కన్వీనర్ అరీఫ్ మాట్లాడుతూ మరోసారి రవిరెడ్డిని ఎంపిక చేయడం హర్షణీయమన్నారు.

మద్దికెరకు మల్లికార్జున యాదవ్

మద్దికెర: మండల వైసీపీ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి నియమించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు మురళిధర్ రెడ్డి, వైసీపీ నాయకులు టి.వెంకటేశ్వరరెడ్డి, కవిరెడ్డి కృష్ణయాదవ్, మంజునాథ్‌యాదవ్, కృష్ణ యాదవ్, పలువురు అభినందించారు.

పత్తికొండ కన్వీనర్‌గా నాగరాజు

పత్తికొండ టౌన్: మండల వైసీపీ కన్వీనర్‌గా పందికోన గ్రామానికి చెందిన కారం నాగరాజు రెండోసారి ఎన్నికయ్యారు.

పాము కాటుతో రైతు మృతి

క్రిష్ణగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కటారుకొండ గ్రామానికి చెందిన బోయ లక్ష్మన్న(62) పాము కాటుతో శనివారం మృతి చెందాడు. వివరాల మేరకు.. లక్ష్మన్న శుక్రవారం పొలానికి వెళ్లి వచ్చే సమయంలో పాము కాటుకు గుర య్యాడు. కుటుంబ సభ్యులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక శని వారం మృతి చెందాడు. కుమారుడు బోయ నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

వేదవతి పూర్తి చేయాలి

ఆలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిలిచి పోయిన వేదవతి, నగరడోణ ప్రాజెక్టులను పూర్తి చేయాలని తెలుగు యువత నాయకుడు సురేంద్ర సీఎం చంద్రబాబుకు విన్నవించారు. శనివారం మంగళగిరిలో సీఎంను కలిశారు. ఆలూరులోని ప్రభుత్వ డిగ్రీ, గిరిజన బాలికల గురుకుల హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలన్నారు. జింకల పార్క్‌ను ఏర్పాటు చేసి పంట పొలాలను రక్షించాలని కోరినట్లు తెలిపారు.

ఐక్యత చాటాలి

ఆదోని అగ్రికల్చర్ జనవరి11 (ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజలు ఐక్యత చాటాలని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి చందం మల్లికార్జున పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీనివాసులు, బీమా, గోపాలకృష్ణ, నాగేంద్రయ్య, సతీష్, శేషన్న, నరసయ్య, మాణిక్ రెడ్డి, ఉమేష్ ధనుష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

వెల్దుర్తి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30, 31 తేదీల్లో విజయవాడలో నిర్వహిచనున్న ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ కార్యదర్శి ఏ.ఈశ్వర్ పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

ఆదోని అగ్రికల్చర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిల్చిన్ పేట అంబా భవాని ఆలయం ఆవరణలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మైదానమంతా రంగులమయగా మారింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు జిందే శంకర్, ఆదిశేషులు, జిందె హల్లి శంకర్, రఘునాథ్, నాగరాజు, సరోదే వినోద్, పొందే లక్ష్మణ్ కమలే వెంకట, పాండ్రె మోహన్ సత్య నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి


వెల్దుర్తిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

వెల్దుర్తి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పాతబస్టాండు సర్కిల్ వద్ద శనివారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనుచ రుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం హర్షణీయమని మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు జ్ఞానేశ్వర్‌గౌడు అన్నారు. వడ్డెర సంఘం నాయకులు మల్లి కార్జున, మారెన్న, మహేష్, సూరి, అశోక్, ఎల్లనాగి, నర్సాపురం కృష్ణ గోవర్ధన్‌గిరి మద్దిలేటి పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి శనివారం నిర్వహించారు. వడ్డెర సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, చెన్నకేశవులు, నిట్రవటి సర్పంచ్ గాదిలింగ, మొత్తప్ప, అప్పయ్య, రామంజనేయులు, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

పశు పోషణ లాభదాయకం




కొత్తపల్లిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ రైతులకు లాభదాయకమని సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయులు, ఎంపీటీసీ విజయలక్ష్మి, ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. శనివారం కొత్తపల్లి గ్రామంలో ఉపాధి పథకం కింద నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. కూటమి అధికారంలోకి వచ్చాక పాడి రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గోకులం షెడ్డు మంజూరు చేసిందని తెలిపారు. ఒక్కో షెడును రూ.2.30 లక్షలతో నిర్మించామన్నారు. ఉపాధి ఈసీ యోగీ రాఘవేంద్ర, టీడీపీ నాయకులు కొత్తపల్లి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- వైద్యాధికారి ప్రవీణ్ కుమార్



తుగ్గలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: సీజనల్, దీర్ఘకాలిక వ్యాధులకు ఏవిధమైన చికిత్స చేన్నారు?

జవాబు: సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్యసిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. రోగులను గుర్తించి చికిత్స చేస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నాము.

ప్రశ్న: 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నారా?

జవాబు: ఆసుపత్రి 24 గంటలు పనిచేస్తుంది. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఆసుపత్రిలో పనిచేస్తున్నారా?

ప్రశ్న: గర్భిణులకు వైద్యం చేస్తున్నారా?

జవాబు: గర్భిణులకు మూడు నెలల నుంచే వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు ఇస్తున్నాం. రక్తహీనతతో బాధప డే వారికి ముక్త భారత్ కింద ప్రత్యేక చికిత్స చేస్తున్నాం. బుధ, శని వారాల్లో గ్రామాల్లోని హెల్త్ క్లీనిక్‌లో వైద్యం చేస్తున్నాము.

ప్రశ్న: రోగులకు వైద్యం, మందులు సక్రమంగా అందుతున్నాయా?

జవాబు: ప్రతి రోగికి మె రుగున చికిత్స చేసి, మందు లు కూడా ఇస్తున్నాం.

ప్రశ్న: పాము కాటుకు చికిత్స ఉందా?

జవాబు: పాముకాటుకు చికిత్స ఉంది.

ప్రశ్న: ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు ఉన్నాయా?

జవాబు: ఆసుపత్రికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించింది. అన్ని రకాల రక్తపరీక్షలు కూడా చేస్తున్నాం.

ప్రశ్న: మండలంలో 104, 108 సేవలందుతున్నాయా..?

జవాబు: 104, 108 వాహనాలు ఉన్నాయి. 104 ద్వారా గ్రామాల్లో వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఇస్తున్నాం.

ప్లాటినమ్ జూబ్లీ వేడుకలకు పీఠాధిపతికి ఆహ్వానం



ఆహ్వానపత్రికను పీఠాధిపతికి అందజేస్తున్న ప్లాటినమ్ జూబ్లీ కమిటీ నాయకులు

మంత్రాలయం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్లాటినమ్ జూబ్లీ వేడుకలకు మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులను కమిటీ సభ్యులు మాచాని వెంకటేశ్ పారిశ్రామికవేత్త, సమాజ సేవకుడు, విప్ర బాంధవుడు అవార్డు గ్రహీత మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు పీఠాధిపతిని కలిసి ఆహ్వానించారు. శనివారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను కలిసి ఎమ్మిగనూరు పట్టణంలో 77వ పాఠశాల, జూనియర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలకు ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. కమిటీ సభ్యులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి పీఠాధిపతి ఆశీర్వదించారు. కమిటీ సభ్యులు డా.వెంకటేశ్వరరావు, గణేష్, ఈరన్నగౌడు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న పురుషోత్తం రెడ్డి

పెద్దకడుబూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. శనివారం పెద్దకడబూరులోని బీజేపీ నాయకురాలు మేరి అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, మంత్రాలయం బీజేపీ అధ్యక్షుడు సత్యానారాయణ రెడ్డి, బనవాసి బీజేపీ నాయకులు సంజీవరెడ్డి, మండల నాయకులు చిన్న రాముడు, రామకృష్ణ, జనసేన నాయకులు గణేష్, వేంకటరెడ్డి, పెండేకంటి నరసన్న,నూరు బాషా, కళింగ పాల్గొన్నారు.

జీడీపీ కింద జోరుగా వరినాట్లు



వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

గోనెగండ్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి రైతులు తమ వ్యవసాయ పొలాల దగ్గర వరినాట్లు వేస్తున్నారు. గాజులదిన్నెప్రాజెక్టు కింద పొలాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. దాదాపు 700 ఎకరాలు వరి నాట్లు వేస్తున్నారు. రైతులు బావులు, బోర్ల దగ్గర వరి నాట్లను వేస్తున్నారు. సోనా మసూర్, జిలకర సోనా, 65 డీపీ, తెల్ల హంస, కర్నూలు సోనా, రకాలను సాగు చేస్తున్నారు. పత్తి, వేరుశనగ, పంటను తీసివేసి వరిని సాగు చేస్తున్నారు. గాజులదిన్నె, ఐరన్‌బండ, హెచ్ కైరవాడి, వేముగోడు, పుట్టపాశం, పెద్దనేలటూరు, ఎన్నెకండ్ల, గోనెగండ్ల గ్రామాల్లో అధికంగా వరి సాగు చేస్తున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి పూలే సొసైటీ సభ్యులు అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. తుంగభద్ర రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే అనాథ వ్యక్తి వయస్సు 40 సంవత్సరాలు స్టేషన్ సమీపంలో సిమెంటు దిమ్మెకు ఉరి వేసుకున్నాడు. అటుగా పొలాలకు వెళ్తున్న వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాధవరం పోలీసులు, వీఆర్వో పరిశీలించి అనాథ వ్యక్తిగా గుర్తించి, పూలే సొసైటీకి సమాచారాన్ని తెలియజేయగా పూలే అంబేడ్కర్ సొసైటీ వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న, డా గణేష్, సాతర్ల ప్రసాద్, అబ్రహం, ఎమ్మిగనూరు శ్మశాన వాటిక అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వీరేష్ పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మంత్రాలయం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి, అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో అవసరమైన అదనపు గదులు, ప్రహరీగోడ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర వాటిని విద్యాంజలి పోర్టల్‌లో సబ్మిట్ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సంబంధించిన ప్రతిపాదనలకు సంక్రాంతి సెలవుల్లో సోమవారంలోపు పూర్తి చేసి జిల్లా అధికారులకు పంపాలని తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన పనులకు కేంద్ర ప్రభుత్వం పనులు చేపడుతుందని, ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించి విద్యాంజలి పోర్టల్‌లో సబ్మిట్ చేసి సహకరించాలని కోరారు.

14న సంక్రాంతి ముగ్గుల పోటీలు



మాట్లాడుతూ సురేష్‌కుమార్

ఎమ్మిగనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా పట్టణంలో డీవైఎఫ్‌ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా 14వ తేదీ శివన్న నగర్ సచివాలయం దగ్గర ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మహేష్, రాముడు, లక్ష్మీనరసయ్య, అబ్దుల్లాలు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన వైసీపీ

గుడికల్లులో గోకులం షెడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రైతులను విస్మరించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గుడికల్లు గ్రామంలో రైతు లింగన్న నిర్మించుకున్న గోకులం షెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి నిత్యం కృషి చేస్తుందని, సాగునీటితో పాటు రైతులకు సబ్సిడీ కింద గోకులంషెడ్లు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తుందన్నారు. అలాగే రైతుల పశువులకు బీమా సౌకర్యాన్ని సైతం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బంగారమ్మ, ఏడీఏ సుబ్రమణ్యా ఆచారి, ఈవో పీఆర్డీ విజయలక్ష్మి, ఏపీవో విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు దేవదాసు, అయ్యన్న, మల్లికార్జున, మురళికృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కేశన్న, కేటీ వెంకటేశ్వర్లు, జగదీష్, రాఘవేంద్ర, డీలర్ ఈరన్న, వీరాంజనేయులు, రంగనాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు మంచి రోజులు

పెద్దకడుబూరు: మండలంలోని నాగాలపురం గ్రామంలో మినీ



నాగలాపురంలో గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

గోకులం షెడ్డును టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, మల్లికార్జున, మీసేవ అంజనేయులు, గోపాల్ రెడ్డి, బొగ్గుల తిక్కన్న, బొగ్గుల నరసన్న, నరసింహులు, హనుమయ్య, ఎంపీడీవో జయరాముడు, ఏపీవో ఖాదర్ బాషా పాల్గొన్నారు.

కౌతాళం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులు తీస్తుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం కౌతాళంలో మినీ గోకులాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బరాజు, పశు వైద్యాధికారి జగదీష్, ఏపీవో మాధవ శంకర్, టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, ఎల్‌ఎల్‌సీ పీసీ మెంబరు టిప్పుసుల్తాన్, మాజీ ఎంపీటీసీ సాద్రీ బసవరాజు, బీజేపీ నాయకులు హల్వి హనుమంతు, జనసేన నాయకులు రామాంజనేయులు టీడీపీ నాయకులు సతీష్ నాయుడు, కాత్రికి చంద్ర, అమ్ము వలి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని వేముగోడు గ్రామంలో మినీ గోకులం షెడ్‌ను ఎంపీడీవో మణిమంజరి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నజీర్, తిరుపతయ్య, గౌండ రహంతుల్లా, నరసింహ, అల్లివ పీరా, బండపల్లిఓబులేష్, కొత్తింటి ఫకృద్దీన్, డీలర్ ఫకృద్దీన్, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి





పెద్దకడబూరులో ఓబన్న చిత్రపటానికి నివాళులుర్పిస్తున్న వడ్డెర నాయకులు, నాగలదిన్నెలో.. కోసిగిలో..

పెద్దకడుబూరు , జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమాలు చేసి జాతి ఉనికిని చాటిని గొప్ప సమరయోధుడు వడ్డే ఓబన్న అని వడ్డెర సంఘం నాయకుడు లింగమూర్తి అన్నారు. శనివారం పెద్దకడబూరులోని వడ్డే ఓబన్న చిత్రపటంతో ఊరేగింపు చేసి ఆయనకు నివాళులర్పించారు. వడ్డెర నాయకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని నాగలదిన్నె గ్రామంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. వడ్డె నాగరాజు, అంజి, లింగన్న, జమ్మన్న, నాగార్జున, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోసిగి: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని శనివారం కోసిగిలోని వడ్డెర కాలనీలో ఆ సంఘం నాయకులు జరుపుకున్నారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డే రామయ్య, వెంకటేశ్, వీరయ్య, రాముడు, ఎల్లప్ప, శ్రీనివాసులు, రాముడు, రాజు, తిప్పయ్య ఉన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని బోడబండ గ్రామంలో వడ్డే ఓబన్న జయంతిని వడ్డెర సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఓబన్న చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అలాగే ఎమ్మిగనూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేశన్న ఆధ్వర్యంలో వడ్డె ఓబున్న జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, అంజినయ్య, రాధాకృష్ణ, రాముడు, కేశన్న, స్వర్ణప్ప, రామకృష్ణ, రంగస్వామి, నరసింహులు, అంజినయ్య, నరసప్ప, శివ, చెన్నప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



బోడబండలో..

చేనేత పురికి జాతర శోభ

- 13 నుంచి నీలకంఠేశ్వరుడి ఉత్సవాలు
- 15న స్వామివారి మహా రథోత్సవం
- ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న రైతు సంబరాలు




ఎమ్మిగనూరులో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం, స్వామివారి మూలవిరాట్

ఎమ్మిగనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చేనేతపురిలో కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఆరాధ్య దైవం నీలకంఠేశ్వరుడు. ప్రతి ఏటా పుష్యమాసంలో నీలకంఠేశ్వరుడి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. దాదాపు నెల రోజుల పాటు సాగే జాతర సందడి ఈనెల 13న సోమవారం నుంచి మొదలుకానున్నది. స్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 13న పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, 14న ప్రభావళి మహోత్సవం, 15న మహారథోత్సవం, 16న వాహ్యావళి, 17న తీర్థావళి వసంతోత్సవం, మహేశ్వర బ్రాహ్మణసన్మానోత్సవం జరుగుతాయి. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. తేరు బజారులో గరుసు వేసి చదును పనులు నిర్వహించేందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారులను శుభ్రం చేస్తున్నారు. సోమప్ప సర్కిల్, ఓం సర్కిల్, అన్నమయ్య సర్కిల్, శివసర్కిల్, సోమేశ్వర సర్కిళ్లతో పాటు ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే రైతు సంబరాలు ప్రతిఏటా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ బల ప్రదర్శన పోటీలను తిలకించేందుకు రైతులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. ఇప్పటికే అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు కొనసాగుతుండగా, అంతర్‌రాష్ట్ర ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తేరుబజారు ప్రాంతాన్ని పరిశీలించిన డీఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వరస్వామి జాతర సందర్భంగా రథోత్సవం జరిగే ప్రాంతమైన తేరుబజారును శనివారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాన్ని ప్రజలు ప్రశాంతంగా ఆనందంగా జరుపుకోవాలన్నారు. రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ఆకతాయిలు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర, రథోత్సవం సందర్భంగా పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఆయన వెంట పట్టణ సీఐ శ్రీనివాసులు, పట్టణ ఎస్ఐ నాయక్, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్తలు మురళీధర్, మాచాని శివశంకర్ పాల్గొన్నారు.

20 నుంచి పైలెట్ గ్రామాల్లో భూముల రీ సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి

కౌతాళం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైలెట్‌గ్రామంగా ఎన్నికైన గుడికంబాలి గ్రామ రైతుల భూముల్లో ఈనెల 20నుంచి రీ సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం గ్రామ రైతులతో అవగాహన ర్యాలీ, రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో చేపట్టిన రీసర్వే మాదిరిగా ఎలాంటి తప్పులకు ఆవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా పైలెట్ రీ సర్వే చేపడుతామన్నారు. ఇందులో గ్రామాన్ని మొత్తం 200 నుంచి 250 ఎకరాలను ఓ క్లస్టర్‌గా ఎంపిక చేసుకుని ఇందులో ఒక సర్వేయర్, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏతో కలిసి ఒక టీంగా ఏర్పడి ప్రతి రోజు 20ఎకరాలు సర్వే చేపడుతారన్నారు. సర్వే చేసేందుకు 10 రోజులు ముందుగా సంబంధిత సర్వే నెంబరులో ఉన్న రైతులకు నోటీసులు అందజేస్తారు. అధికారులు తెలిపిన తేదీలో రైతులు తమకు సంబంధించిన భూమి పత్రాలతో వచ్చి వారి హద్దులు చూపి తప్పక హాజరుకావాలన్నారు. రైతులందరిని సమక్షంలోనే సర్వే చేసి వారికి హద్దులు చేపిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు వడ్డెర కులస్థులు తహసీల్దార్ గారికి వడ్డే ఓబన్న చిత్రపటాన్ని అందజేయగా వారితో కలిసి ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో మండల సర్వేయర్ బసవరాజు స్వామి వీఆర్వోలు ఉన్నారు.

కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి: ఎస్ఐ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ పరమేష్‌నాయక్

మంత్రాలయం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ అన్నారు. శనివారం మంత్రాలయం సమీపంలో మాధవరం రోడ్డు అంజనేయస్వామి దేవాలయం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, కార్లు,ఆటోలు, మోటారుసైకిళ్లు ఆపి ప్రయాణికుల సంచులను తనిఖీ చేశారు. రికార్డులు, అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. మాధవరం చెక్‌పోస్టు అధికారులు సైతం నిఘా ఉంచి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. పోలీసులు నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో సోమశేఖర్, పరమేష్, రామాంజి పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై ఊరేగారు. శనివారం ధనుర్మాసం ద్వాదశి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు , జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. రెండో శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

వైసీపీ మండల అధ్యక్షుడిగా శివారెడ్డిగౌడు

నందవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా నందవరం గ్రామానికి చెందిన శివారెడ్డిగౌడును శనివారం ఎంపిక చేశారు. రెండోసారి మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్‌తో పాటు, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎల్‌ఎల్‌సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, గోనెగండ్ల వైసీపీ మండల అధ్యక్షుడు వేముగోడు కృష్ణరెడ్డి, సోమలగూడురు వెంకటేశ్వర రెడ్డి, మాచాపురం కోటేశ్వర్, రమేష్‌గౌడు, ఎల్లాగౌడు, దత్తాత్రేయగౌడు అభినందించారు.

పట్టణ అధ్యక్షుడిగా నాగేషప్ప

ఎమ్మిగనూరు టౌన్: వైసీపీ పట్టణ అధ్యక్షుడిగా నాగేషప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుకకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే చెన్న కేశవ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి, వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఎమ్మిగనూరు మండలం అధ్యక్షుడిగా బీ.ఆర్ బసిరెడ్డిని నియమించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మీసాల నీలకంఠ, శివప్రసాద్, సునీల్, వైస్ చైర్మన్ నజీర్, గడ్డం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా కేవీ కృష్ణారెడ్డి

గోనెగండ్ల: గోనెగండ్ల మండల వైసీపీ కన్వీనర్‌గా మాజీ ఎంపీపీ వేముగోడు కృష్ణారెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో శనివారం ఆ గ్రామంలోని వైసీపీ నాయకులు బాణసంచ పేల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరేష్‌రెడ్డి, రవిరెడ్డి, ఉరుకుందరెడ్డి, నాగన్న, సురేష్, శేఖర్, బీలరాజు, లక్ష్మన్న, శ్రీను, గిడ్డయ్య, హనుమంతు, రాజారెడ్డి, భాస్కర్, సాల్మన్, హరి భరత్, పాల్గొన్నారు.

ఆకాశాన్ని అంటుతున్న గ్రాసం ధరలు

ట్రాక్టర్ గడ్డి రూ. 18వేలు



ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న వరి గడ్డి

గోనెగండ్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతుంది. ఆదోని డివిజన్‌లో గ్రాసం వచ్చే పంటలు ఎక్కువగా సాగుచేయక పోవడం, ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా గ్రాసం దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా వర్షాలు కురియడం, చేతికి అందిన గ్రాసం నల్లగా మారిపోవడం దీనికి తోడు ఈ మండలాలలో పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. చాలా మంది రైతులు గ్రాసం కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి రూ.18 వేల వరకు పలుకుతుంది. గోనెగండ్ల మండలంలో ఆవులు, ఎద్దులు, 15,530, బర్రెలు 4,603, గొర్రెలు, 45,257, మేకలు 540, కోళ్లు బాతులు 30,665లు ఉన్నాయి. గ్రాసం కొరత కారణంగా బళ్లారి, ప్రాంతాల నుంచి పశువుల యజమానులు గ్రాసాన్ని దిగుబడి చేసుకుంటున్నారు. అలాగే వరి, వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసిన చోట నుంచి గ్రాసం దిగుబడిచేసుకునేందుకు పశుయజమానులు సిద్ధమయ్యారు.